ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
మంగళవారం 23 జనవరి 2024



చిట్యాలలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న గ్రామస్థులు

- అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ.. ఊరూరా ప్రత్యేక పూజలు
- మార్మోగిన శ్రీరామ నామం
- హోరెత్తిన ఆలయాలు
- అపూర్వ ఘట్టాన్ని ప్రత్యక్ష వీక్షణ
- మెరిసిన వాకిళ్లు.. ముస్తాబైన లోగిళ్లు

# అంతా.. రామమయం

భూపాలపల్లిటౌన్, జనవరి 22: అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ ఘట్టాన్ని జిల్లా ప్రజలు ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వీక్షించారు. ఊరూరా 'జై శ్రీరాం' నామం మార్మోగింది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఇళ్లూ వాకిళ్ల ముగ్గులు, తోరణాలతో ముస్తాబయ్యాయి. బాణసంచా కాల్చి ప్రజలు సంబరాలు చేసుకున్నారు. ఎక్కడా చూసినా పండుగ వాతావరణమే కనిపించింది.

శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా జిల్లాలోని దాదాపు అన్ని ఆలయాల్లో భక్తులు, పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే లేచి స్నానమాచరించి అనంతరం ఆలయాలకు వెళ్లి ముందుగా సంకీర్తన కార్యక్రమాలను నిర్వహించారు. మహదేవపూర్ మండలం శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం, గణపురం మండలంలోని శ్రీగణపేశ్వరస్వామి ఆలయం, రేగొండ మండలంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం, కాటారంలోని శ్రీ అయ్యప్ప దేవాలయం, హనుమాన్ దేవాలయం, భూపాలపల్లి పట్టణంలోని శ్రీసీతారామంజనేయస్వామి ఆలయంతోపాటు సాయిబాబా, శ్రీ అయ్యప్ప, శ్రీ వెంకటేశ్వరస్వామి, భక్తాంజనేయస్వామి, శ్రీకృష్ణమందిర్, హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీరాముడిని జరిపించారు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను చల్లుకుని తమకు శ్రీరాముడి దీవెనలు అందాయని సంబురాలు జరిపారు. ఈ కార్యక్రమాల సందర్భంగా ఆలయాల వద్ద పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### అన్నదాన కార్యక్రమాలు

జిల్లాలోని పలు ఆలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, సుభాష్‌కాలనీలోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయం, జంగేడు, మహదేవపూర్, కాళేశ్వరం, మల్హర్, కాటారం, చిట్యాల తదితర మండలాల్లో చేపట్టారు. భూపాలపల్లిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సుమారు 2 వేల మందికి పైగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

### ఎల్‌ఈడీ స్ర్కీన్ల ఏర్పాటు

అయోధ్యలో ఏర్పాటు చేసిన బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రజలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు విశ్వహిందూ పరిషత్, హనుమాన్ భక్త, భజన మండళ్లు, భజరంగ్‌దళ్ కమిటీల ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ స్ర్కీన్లను ఏర్పాటు చేశారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించి పులకించిపోయారు.

### కూడళ్ల వద్ద సంబరాలు

బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సభ్యులు, హనుమాన్ భక్తులు భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద బాణసంచా కాల్చి సంబురాలు జరిపారు. 'జైశ్రీరాం.. జైజైశ్రీరాం' అంటూ నినాదాలు చేశారు. మహిళలు రాత్రి సమయంలో తమ ఇళ్ల ముందు ఐదు దీపాలు వెలిగించి శ్రీరాముడికి స్వాగతం పలికినట్లు తోరణాలు ఏర్పాటు చేశారు. పసుపు కుంకుమలు చల్లి, కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.



కాటారంలో భక్తాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలో భక్తులు



అయోధ్యలో జరిగిన బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భూపాలపల్లిలో ప్రత్యక్ష ప్రసారం వీక్షిస్తున్న భక్తులు



మంగపేట మండలం బోరునర్సాపురంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ములుగులోని శ్రీక్షేత్రంలో భజన చేస్తున్న భక్తులు

## అయోధ్య కరసేవకులకు సన్మానం



భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో అయోధ్య కరసేవకులను సన్మానిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

మహదేవపూర్, జనవరి 22: అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో సంబరాలు జరిగాయి. అయోధ్య కరసేవలో పాల్గొన్న వారిని ఈ సందర్భంగా వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమం జరగ్గా మహదేవపూర్ ఎంపీపీ రాణిబాయి, జడ్పీటీసీ అరుణ, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దేవరావు, వీహెచ్‌పీ నాయకులు గుడాల కృష్ణమూర్తి, కేశవరావు, జగన్మోహనాచారి, అంకిరెడ్డి, గొర్రెబాపు పాల్గొన్నారు.

## మార్మోగిన శ్రీరాముడి జపం



ఏటూరునాగారంలో శోభాయాత్రలో రామభక్తులు

- ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా భక్తుల ఆనందోత్సవాలు
- శోభాయాత్రలు, భజనలు, అన్నదానాలు
- ఆలయాల్లో పూజా కార్యక్రమాలు
- పలు చోట్ల సీతారాముల కల్యాణం

ములుగు, జనవరి 22: జిల్లా ప్రజలు రామనామస్మరణతో పులకించి పోయారు. అయోధ్యలో నిర్మాణమైన దివ్యమైన, భవ్యమైన రామమందిరంలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరగ్గా జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలను నిర్వహించారు. వైష్ణవ, శైవ క్షేత్రాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. శోభాయాత్రలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. జిల్లా కేంద్రంతోపాటు మల్లంపల్లి, దేవగిరిపట్నంలోని రామాలయాలు, ఆయా గ్రామాలలోని మందిరాలలో పూజలు ఘనంగా జరిగాయి. రామాలయం, నగరేశ్వరస్వామి ఆలయాల్లో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన ఘట్టాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. భారీ తెరపై అపూర్వ దృశ్యాన్ని తిలకించిన భక్తులు తన్మయత్వం పొందారు. నగరేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు కోలాట నృత్యాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. రాముడి చిత్రపటం కలిగిన జెండాను ప్రదర్శిస్తూ పురవీధుల్లో భక్తులు శోభాయాత్ర జరిపారు. శ్రీక్షేత్రంలో భక్తులు భజనలు చేశారు. సాయంత్రం సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు కోదండ రాముడిని దర్శించుకున్నారు. మల్లంపల్లిలోని రామాలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, ధర్మజాగరణ సమితి నేత గండ్రకోట కుమార్, వాసుదేవరెడ్డి, ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## సత్వరంగా ప్రజా సమస్యల పరిష్కారం

### భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 22: ప్రజా సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిపై ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన వినతులను పరిశీలించి ప్రాధాన్య క్రమంలో త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 28 వినతులు రాగా వాటిని కలెక్టర్ స్వీకరించి పరిశీలించారు.

## 'దళితబంధు' నిధులు విడుదల చేయాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 22: భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట దళితులు సోమవారం ధర్నా చేశారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన దళితబంధు పథకం నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని రేగొండ మండలానికి చెందిన సుమారు 50 మంది దళితులు ఆందోళనకు దిగారు. అనంతరం ప్రజావాణి (గ్రీవెన్స్)లో కలెక్టర్ భవేష్ మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం తమకు దళితబంధు పథకాన్ని వర్తింపజేస్తూ నిధులను మంజూరు చేసిందని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో విడుదల చేయలేదని అన్నారు. ఎన్నికల అనంతరం తమ బ్యాంకు అకౌంట్లను హోల్డ్‌లో పెట్టారని, దీంతో దళితబంధు డబ్బులు జమ కాలేదని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించి, వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రేగొండ మండలం అధ్యక్షుడు అంకం రాజేందర్, భూపాలపల్లి మునిసిపల్ కౌన్సిలర్ హరీశ్, దళితబంధు లబ్ధిదారులు మొగిళి, కుమారస్వామి, అజయ్, మల్లయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిలిండర్ల చోరీ కేసులో అరెస్టు

మహదేవపూర్, జనవరి 22: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో నాలుగు రోజుల క్రితం నాలుగు గ్యాస్ సిలిండర్లు చోరీకి గురికాగా పాఠశాల ఎస్‌వో ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఒకరిని అరెస్టు చేసి సిలిండర్లను రికవరీ చేశారు. సిలిండ్ల చోరీ కేసులో మండల కేంద్రానికి చెందిన కర్రి లక్ష్మణ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు మహదేవపూర్ ఎస్సై ప్రసాద్ సోమవారం వెల్లడించారు.

## దేవుడి పేరుతో అక్రమాలు

- జనం సొమ్ముతో ఆలయ నిర్మాణం
- సొంత ట్రస్టు పేరుతో రిజిస్ట్రేషన్
- ఆరోపణలన్నీ నిరూపిస్తా...
- లేదంటే రాజకీయ సన్యాసమే..
- మాజీ ఎమ్మెల్యేపై ఎమ్మెల్యే సత్యనారాయణరావు ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎస్సార్

రేగొండ, జనవరి 22: దేవుడి పేరు చెప్పుకొని అక్రమాలకు పాల్పడ్డారని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మండిపడ్డారు. తన ఆరోపణలు తప్పయితే రాజకీయ సన్యాసానికి సిద్ధమని సవాల్ విసిరారు. మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలో ఉన్న ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. భూపాలపల్లి మంజూర్‌నగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణ విషయంలో తాను చేసిన

మిగతా 8వ పేజీలో...



- మహాజాతర పనులు ముమ్మరం
- వనదేవతల సాలహారానికి రంగులు
- వైద్య శిబిరాల ఏర్పాటుకు స్థల సేకరణ

## ముస్తాబవుతున్న మేడారం

మేడారం, జనవరి 22 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో మహాజాతర పనులు చురుగ్గా సాగుతున్నాయి. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్ పర్యవేక్షణలో అభివృద్ధి పనులు సాగుతుండగా ఆయా శాఖల అధికారులు వాటిలో నిమగ్నమయ్యారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు సమ్మక్క, సారలమ్మ మహాజాతర జరగనుండగా అధికారులు చురుగ్గా పనులు చేపడుతున్నారు. అందులో భాగంగా వనదేవతల సాలహారానికి సోమవారం పెయింటింగ్ పను లు ప్రారంభించారు. తల్లుల గద్దెల ప్రాంగాణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ప్రాకారం, సాలారం, ప్రధాన గేట్లు, క్యూలైన్లకు రంగులు దిద్దుతున్నారు. అదేవిధంగా రంగురంగుల విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తున్నారు.



జంపన్నవాగు పరిసరాల్లో వైద్య శిబిరానికి స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

### వైద్య శిబిరాల ఏర్పాటు

మహాజాతరకు హాజరయ్యే భక్తుల కోసం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గద్దెల సమీపంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జాతర సమయంలోనే కాకుండా ముందస్తుగానే భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్న నేపథ్యంలో వారి సౌకర్యార్థం సుమారు 20 వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా ప్రస్తుతం జంపన్నవాగు వద్ద వైద్య శిరాన్ని ఏర్పాటు చేసేందుకు ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య స్థలాన్ని సేకరించారు.



సాలహారానికి రంగులు వేస్తున్న పెయింటర్స్

స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన రైతు జాలపు అనంతరెడ్డిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మహాజాతరలో వైద్య శిబిరాల కోసం కేటాయించిన స్థలాలను వ్యాపారులు ఆక్రమిస్తున్నారని అన్నారు. జాతర సమయంలో దుకాణాలను తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారులు విజయభాస్కర్, మహమ్మద్, సంజీవరా వు, సిబ్బంది సమ్మయ్య, తిరుపతి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## గండ్ర జ్యోతి పాదయాత్రకు బ్రేక్

### కాళ్ల నొప్పులు కారణంగా తాత్కాలిక నిలిపివేత



చెన్నారావుపేటలో పాదయాత్రగా వెళ్తున్న గండ్ర జ్యోతి

చెన్నారావుపేట, జనవరి 22 : భూపాలపల్లిలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో తిరుపతికి కాలినడకన బయల్దేరిన వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి యాత్రకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఆమె పాదయాత్ర వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రం మీదుగా సోమవారం కొనసాగింది. మండలంలో ఏడు కిలో మీటర్లు నడవగానే అరికాళ్లకు బొబ్బలు రావటంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి ఆమె చేరుకున్నారు. కాళ్ల నొప్పులు తగ్గిన అనంతరం పాదయాత్రను కొనసాగిస్తామని తెలిపారు. అయోధ్య శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఏపీవో కార్యాలయంలో తన భర్త, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డితోపాటు చెన్నారావుపేట ఎంపీపీ బాదావత్ విజేందర్, నల్లబెల్లి జడ్పీటీసీ, బీఆర్‌ఎస్ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, సర్పంచ్ కుండె మల్లయ్య, మాజీ జడ్పీటీసీ రాంరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎం.డి.రఫీ, కంద కట్ల సాంబయ్య, సర్పంచ్ అనుముల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## 52 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 22: భూపాలపల్లి నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిపోతున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. భూపాలపల్లిలోని జంగేడు రహదారిలో సోమవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నామని ఎస్సై సంధ్యారాణి తెలిపారు. భూపాలపల్లి మునిసిపల్ పరిధిలోని సీఆర్‌నగర్‌కు చెందిన తూర్పాటి సిద్ధు జంగేడు పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి మహారాష్ట్రలో అధిక రేటుకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు తన సిబ్బందితో తనిఖీ చేయగా డీసీఎం వ్యానులో 52 క్వింటాళ్ల బియ్యం లభ్యమైందని చెప్పారు. సిద్ధుపై కేసు నమోదు చేసి, బియ్యాన్ని స్వాధీనం పర్చుకున్నామని వివరించారు.

## 30 నుంచి ఇంజనీరింగ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 22 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జనవరి 30 నుంచి ఇంజనీరింగ్ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 30, ఫిబ్రవరి 1, 3, 6 ,8 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తులిపారు. బీటెక్ (సీబీసీఎస్) మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ రెగ్యూలర్, సప్లిమెంటరీ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని కోరారు. కేయూ క్యాంపస్ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల, కేయూ క్యాంపస్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, జనవరి 22: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోందని బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం, డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు.

## జాతీయ స్వచ్ఛాగ్రహి అవార్డుకు ఎంపిక

### జంగాలపల్లి సర్పంచ్ దంపతులకు ఢిల్లీ నుంచి ఆహ్వానం


అనిత-వినయ్‌కుమార్

ములుగు, జనవరి 22: ములుగు మండలం జంగాలపల్లి సర్పంచ్ మసర గాని అనిత, ఆమె భర్త వినయ్‌కుమార్‌కు అరుదైన అవకాశం దక్కనుంది. ఈనెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు ప్రత్యేక అతిథులుగా పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా గ్రామంలో పారిశుధ్య పనులను విజయవంతంగా చేపట్టడం, ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో వంద శాతం చేపట్టడంతో స్వచ్ఛాగ్రహి అవార్డుకు ఎంపిక చేశారు. ఐదు వేల మంది జనాభా, 2,860 మంది ఓటర్లు, 1,150 ఇళ్లు కలిగిన జంగాలపల్లిలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, అన్ని వీధుల్లో అంతర్గత రోడ్లు, సైడ్‌డ్రెయినేజీల నిర్మాణం జరిగింది. ఇటీవల గ్రామాన్ని సందర్శించి స్వచ్ఛభారత్ కేంద్ర బృందం దీనిపై సంతృప్తి వ్యక్తం చేసింది. బృందం సభ్యులు ఇచ్చిననివేదిక ఆధారంగా సర్పంచ్ దంపతులకు పురస్కారం దక్కనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు గ్రామపంచాయతీలు, ఇద్దరు రాష్ట్ర కోఆర్డినేటర్లు ఈ అవార్డుకు ఎంపిక కాగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి జంగాలపల్లి పంచాయతీ ఒక్కటే ఉండటం విశేషం. ఈనెల 24 నుంచి 29 వరకు ఢిల్లీ పర్యటన కొనసాగనుండగా సర్పంచ్ అనితతో పాటు ఆమె భర్త వినయ్‌కుమార్ పాల్గొననున్నారు.

## నేడు కేడీసీలో అతిథి

## అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, జనవరి 22 : హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్, మైక్రో బయాలజీ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టుకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు జనవరి 23న మంగళవారం ఉదయం 11 గంటలకు ధృవపత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలతో ఇంటర్వ్యూలకు కళాశాలలో హాజరు కావాలని కోరారు.

# నరికివేత సరే, తొలగింపేది..?

**● విద్యుత్‌శాఖ - జీడబ్ల్యూఎంసీ మధ్య 'ట్రీ వార్' ● రోడ్ల పక్కనే రోజుల తరబడి చెట్ల కొమ్మలు**
**● తరలింపు మీదంటే మీదని ఇరు సంస్థల దాగుడుమూతలు ● సమన్వయ లోపంతో నగరవాసుల ఇబ్బందులు**


వడ్డెపల్లి టీచర్స్ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా పడి వున్న చెట్ల కొమ్మలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 22: విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరికివేస్తున్న విద్యుత్‌శాఖ.. ఆ తర్వాత వాటి తొలగింపును మాత్రం విస్మరిస్తోంది. నరికిన చెట్ల తొలగింపు వ్యవహారం బల్దియా, విద్యుత్ శాఖ మధ్య వివాదంగా మారింది. ఈ బాధ్యత మీదంటే.. మీదే అంటూ రెండు శాఖలు ఒకరిని ఒకరు నిందించుకుంటున్నాయి. రెండు శాఖల తీరుతో నగరవాసులు మాత్రం చెట్ల కొమ్మల నరికివేతతో సమస్యలను ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి చెట్ల కొమ్మలు తొలగించకపోవడంతో కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### జీడబ్ల్యూఎంసీ, విద్యుత్‌శాఖల మధ్య..

నరికిన చెట్ల కొమ్మలను ఎవరు తొలగించాలనే వ్యవహారం కొన్నేళ్లుగా పరిష్కారం కావడం లేదు. విద్యుత్ శాఖ, బల్దియాల మధ్య ఈ అంశం పెద్ద రగడగానే పరిణమించింది. ఇరుశాఖలు పరస్పరం సహకారం, సమన్వయంతో వ్యవహరించడం లేదు. దీంతో సమస్య తీవ్రమై రెండు శాఖల మధ్య వార్ జరుగుతోంది.

### విద్యుత్ శాఖ నిర్లక్ష్యం

విద్యుత్ శాఖ నరికిన చెట్ల కొమ్మలను తొలగించడం లేదు. ట్రీ కటింగ్ పేరుతో ఇష్టారాజ్యంగా చెట్ల కొమ్మలను నరికివేసి కాలనీల్లోని ఇళ్ల ముందే పడవేసి వెళ్తున్నారు. ఇదేమిటని కాలనీవాసులు ప్రశ్నిస్తే కూడా చెట్ల కొమ్మలు నరికిన వారు దురుసుగా సమాధానం ఇస్తున్నారనే విమర్శలు పెల్లుబికుతున్నాయి. తరువాత తీస్తామని.. లేదంటే బల్దియా వారు తీస్తారంటూ సమాధానమిస్తున్నారు. మరోవైపు విద్యుత్ శాఖ వ్యవహారం బల్దియా తలనొప్పిగా మారింది.

### బాధ్యత మరుస్తున్న విద్యుత్ శాఖ

వాస్తవానికి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వచ్ఛభారత్ మార్గదర్శకాల మేరకు చెట్ల కొమ్మలు నరికిన తరువాత విద్యుత్ శాఖ మాత్రమే వాటిని తొలగించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో జీడబ్ల్యూఎంసీకి తొలగింపు చర్యల నిమిత్తం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ విషయంలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ, పన్ను మదింపు అంశాన్ని జీడబ్ల్యూఎంసీ ఉదహరిస్తోంది. ఇంటి నుంచి చెత్త సేకరణకు గాను ఆస్తిపన్నులో చెత్తపన్నును కలిపి వసూలు చేస్తున్న సంగతిని జీడబ్ల్యూఎంసీ ప్రస్తావిస్తోంది. ఇదేక్రమంలో విద్యుత్ శాఖ కూడా బల్దియా ద్వారా తొలగింపు జరగాలనుకుంటే ఈ మేరకు పన్ను రూపంలో చెల్లించాల్సి ఉంటుందని జీడబ్ల్యూఎంసీ స్పష్టం చేస్తోంది. అలాకాకుండా పన్ను విధించకపోవడం, సొంతంగా కొమ్మలను తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు పెల్లుబికుతున్నాయి.

### రూ.15లక్షల చెల్లింపు నోటీసుల జారీ

చెట్ల తొలగింపు జరిపిన క్రమంలో ఈ మేరకు రూ.15లక్షల పన్ను మదింపు విద్యుత్ శాఖకు జరిగింది. ఇటీవలే ఈ డిమాండ్ నోటీసులను విద్యుత్ శాఖకు జీడబ్ల్యూఎంసీ అందచేసినట్లు తెలిసింది. దీనిపై విద్యుత్‌శాఖ స్పందించడం లేదని బల్దియా చెబుతోంది. నిబంధనల మేరకు చెట్ల కొమ్మలు నరికిన క్రమంలో ఆ చెత్త తొలగింపు బాధ్యత విద్యుత్‌శాఖదే.. లేనిపక్షంలో తొలగింపు చేపట్టిన బల్దియాకు పన్ను అయినా చెల్లించాల్సి ఉంది.

కానీ విద్యుత్ శాఖ తీరు మాత్రం నగరవాసులకు సమస్యను తెచ్చిపెడుతోంది. ఒక డివిజన్‌లో విద్యుత్ శాఖ తొలగించిన కొమ్మలను తీసుకెళ్లేందుకు రోజుకు పది ట్రాక్టర్ ట్రిప్పులు అవసరం అవుతుందని బల్దియా చెబుతోంది. డివిజన్‌కు ఒకే ట్రాక్టర్ కేటాయింపు వల్ల ఈ సమస్య మరీ తీవ్రం అవుతోంది. చెట్ల తొలగింపునకే ట్రిప్పులు సరిపోకపోవడంతో రోజు వారి తొలగించే చెత్త మరో సమస్య బల్దియాకు ఎదురవుతోంది. పెద్ద పెద్ద కొమ్మలను ఇష్టారాజ్యంగా కాలనీల్లో రోడ్లపై పడవేయడం, ఆకులు ఎండి ఆ చెత్త ఇళ్లలోకి రావడం, చెట్లకొమ్మలు రోడ్లపై ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రెండు శాఖ మధ్య సమన్వయం లోపం నగర వాసులకు శాపంగా పరిణమించింది. జీడబ్ల్యూఎంసీ కమిషనర్, ఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు చర్చించుకొని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## నేటి నుంచి శ్రీలక్ష్మినరసింహుడి బ్రహ్మోత్సవాలు

గీసుగొండ, జనవరి 22: గీసుగొండ శ్రీలక్ష్మినరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ ఏనుగుల సాంబరెడ్డి, అర్చకులు అర్చకులు వేదాంత వెంకటనరసింహాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు తెలిపారు. 23న గీసుగొండ గ్రామంలోని ఆలయం నుంచి గుట్టపైకి ఉత్సవమూర్తులు చేరుట, కల్యాణోత్సవం, 24న హోమబలిహరణం, 25న పూర్ణాహుతి, రాత్రి జాతర బండ్లు తిరుగుట, మొక్కులు సమర్పించుట, 26న కేశఖండన, పుష్పయాగం, 27న ఉత్సవమూర్తులు గ్రామాలయానికి పునఃప్రవేశం జరుగునని వారు వివరించారు.

## మైనారిటీ గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

శంభునిపేట, జనవరి 22 : శంభునిపేట దూపకుంట రోడ్‌లోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందవచ్చని ప్రిన్సిపాల్ తాళ్ళ నీలిమాదేవి అన్నారు. సోమవారం గురుకులంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 5వ తరగతితో పాటు ఇంటర్‌లో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు మైనారిటీ, నాన్ మైనారిటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 6,7,8 తరగతుల్లో మైనారిటీలకు బ్యాక్‌లాక్ ఖాళీలను భర్తీ చేయటానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. సంబంధిత ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 77804 02391 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## మహాజాతరలో సేవలకు అవకాశం ఇవ్వండి

### దేవాదాయ శాఖకు సింగరేణి కార్మికుల వినతి

మేడారం, జనవరి 22 : మేడారం మహా జాతరలో ఉచితంగా స్కౌట్ సేవలు అందించడానికి తమకు అవకాశం ఇవ్వాలని సింగరేణి భూపాలపల్లి ఏరియా కార్మికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, దేవాదాయ శాఖ మేడారం కార్యనిర్వాహక అధికారి రాజేంద్రంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గత జాతరలో జంపన్నవాగు పరిసరాల్లో భక్తులకు 90 మంది కార్మికులతో భక్తులకు ఉచిత సేవలు అందించామన్నారు. అవకాశం కల్పిస్తే ఈసారి మహాజాతరలో కూడా సేవలు అందిస్తామన్నారు.

# బండారి సింగిడిలో కొమురవెల్లి

### ఘనంగా పట్నంవారం పెద్దపట్నం, అగ్నిగుండాలు

### నిప్పుల్లో చిందేసిన శివసత్తులు, పోతరాజులు, భక్తులు


అగ్నిగుండంలో చిందేస్తున్న, శివసత్తులు, భక్తులు

చేర్యాల, జనవరి 22: కొమురవెల్లి మల్లికార్జునస్వామిని స్తుతిస్తూ శివసత్తులు, పోతరాజులు, భక్తులు కణకణమని రగిలే నిప్పుల్లో చిందులేసి మైమరచిపోయారు.. దేవుడు..మల్లన్న దేవుడు... అంటూ స్వామివారి నామస్మరణతో అశేష భక్త జనులు పులకించారు. దేవదేవుడి ఆవాహనంతో చేతిలో వీరకోలతో సిగమూగుతూ అగ్నిగుండాలు దాటి తన్మయత్వం చెందారు. భక్తిపారవశ్యంలో కొముర వెల్లి ఓలలాడింది. కొమురవెల్లి మల్లిఖార్జునస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభంలో భాగంగా పట్నంవారాన్ని పురస్కరించుకుని హైదరాబాదుకు చెందిన యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆలయతోటబావి ప్రాంగణంలో మల్లన్నకు అత్యంత వైభవోపేతంగా పెద్దపట్నం వేసి అగ్నిగుండాలు నిర్వహించారు.

యాదవపూజారులు పసుపు, కుంకుమ, పచ్చ, బియ్యంపిండి, సునేరు, పంచ రంగులతో పెద్దపట్నాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. వంటచెరుకుతో అగ్నిగుండాలను తయారుచేశారు.పెద్దపట్నానికి చిత్రకన్ను అమర్చి గుమ్మడి కాయలను అష్టదిక్పాలకు లకు అలంకరించారు. మల్లన్న చరిత్ర, మహిమలను వివరిస్తూ యాదవపూజారులు ఒగ్గుకథను ఆలపించగా భక్తులు జయజయధ్వానాలు చేయడంతో ఆలయపరిసరాలు ప్రతిధ్వనించాయి. భక్తిప్రపత్తులతో వేస్తున్న పట్నాన్ని తిలకిస్తూ అశేష భక్తజనం పులకించిపోయారు. భక్తులు మల్లన్నను స్మరిస్తూ బండారిని వంటినిండా ధరించడంతో ఆలయ పరి సరాలన్నీ పసుపుమయంగా మారింది. పట్నం వేయడం, అగ్నిగుండాలను తయారు చేయడం పూర్తికాగానే గర్భాలయంనుంచి అర్చకులు మహదేవునిమల్లికార్జున్ తదితరులు ఉత్సవవిగ్ర హాలను పోలీసు బందోబస్తు నడుమ తీసుకు వచ్చి పట్నంచుట్టూ ప్రదక్షిణలు చేశారు. యాదవులు గుమ్మడికాయలను బలిహరణ చేయగానే అర్చకులు అగ్నిగుండాలను దాటడం ప్రారంభించారు. అనంతరం మల్లన్నను స్మరిస్తూ అగ్నిగుండాలను దాటి స్వామివారిని దర్శించుకు న్న శివసత్తులు, భక్తులకు ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో బాలాజీశర్మ, పునరుద్ధరణ కమిటీ సభ్యులు తదితరులు కనుములు(ఆచారం) అందించి సత్కరించారు. పలువురు భక్తులు బెల్లంపానకం, నీళ్లప్యాకెట్లను, మరికొందరు అన్నదానం వితరణ చేశారు. బండారిని పంపిణీ చేశారు.

## మేడారంలో ప్లాస్టిక్ నిషేధంపై సమీక్ష


సమీక్షలో మాట్లాడుతున్న డీపీవో వెంకయ్య

మేడారం, జనవరి 22 : మేడారం మహాజాతరలో ప్లాస్టిక్ నిషేధంపై భక్తులకు అవగాహన చేసేందుకు ములుగు డీపీవో వెంకయ్య సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మొబలైజర్లు ఇందులో పాల్గొనగా ఏటూరునాగారం ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ మేడారం మహాజాతరకు సుమారు కోటిన్నర మంది భక్తులు మేడారం తరలివచ్చి విడిది చేస్తారని అన్నారు. వారు వదిలిన వ్యర్థాలతోపాటు ప్లాస్టిక్ అధికంగా ఉంటుందని తెలిపారు. ప్లాస్టిక్ ఫ్రీ మహాజాతరను నిర్వహించుకునేందుకు మొబలైజర్లు కృషి చేయాలన్నారు. భక్తులకు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలను చూపడానికి స్వచ్ఛంద సేవా సంస్థలతో పాటు ఐటీడీఏ ఏటూరునాగారం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా జ్యూట్ బ్యాగుల వినియోగంపై భక్తులకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీవో రహీం, పెసా కమిటీ జిల్లా అధ్యక్షులు, వివిధ మండలాల అధ్యక్షులు, గ్రామపంచాయతీల మొబలైజర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులపై వీధికుక్కల దాడి

### ఇద్దరు విద్యార్థులకు గాయాలు


శునకాల దాడిలో గాయపడిన విద్యార్థులు

సుబేదారి, జనవరి 22 : నగరంలో వీధి కుక్కల దాడులు నిత్యకృత్యమవుతున్నాయి. రెండు రోజులు దాటకముందే మళ్లీ కుక్కలు విజృంభించాయి. ఆదివారం వరంగల్ 21వ డివిజన్ లోని ఎల్‌బీ నగర్‌లో అలీ అక్బర్, అనాస్ అనే ఇద్దరు చిన్నారులపై కుక్కల దాడి చేసి గాయపరిచిన ఘటన తెలిసిందే. అలాగే గత వారం రోజుల క్రితం న్యూశాయంపేట జంక్షన్ నుంచి పద్మాక్షి టెంపుల్‌కు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న కాలనీలో ముగ్గురు వ్యక్తులను గాయపరిచాయి. ఈ రెండు ఘటనలు మరువక ముందే తాజాగా సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వెల్దండి కాలనీకి చెందిన వి. శ్రీహిత, ఎస్. దేవిప్రసాద్‌లు ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. కాగా, సోమవారం ఇద్దరు ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా ఒక్కసారిగా శునకాలు మీద పడి దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన విద్యార్థులకు టీటీ ఇంజక్షన్లు ఇప్పించినట్లు తెలిపారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయీంనగర్, జనవరి 22: ఎన్‌పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని బాలసముద్రం, చిల్డ్రన్స్ పార్కు ఏరియా, మునిసిపల్ కమిషనర్ క్యాంపు ఆఫీస్, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ జిసాంబరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● అలాగే ఎన్‌పీడీసీఎల్ వరంగల్ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా క్రిష్ణా కాలనీ, స్టేషన్‌రోడ్, వరంగల్ చౌరస్తా, రామ్‌కీ, గ్రేన్ మార్కెట్, దయానంద్ కాలనీ, లక్ష్మీపురం, శివనగర్, ఏఎస్ రెడ్డినగర్, రంగశాయిపేట, మహంకాళి గుడి ఏరియా, హంస బేకరీ, గొల్లవాడ, కుమ్మరివాడ, నాయుడు పంపు, గణపతి ఇంజనీరింగ్ కాలేజీ, పెరుకవాడ చమన్, ఎస్ఆర్ఆర్ తోట, బీరన్నకుంట, మామునూర్ టౌన్, కుమ్మరిపల్లి, గవర్నమెంట్ డైరీ ఫామ్, పీవీఎన్ఆర్ వెటర్నరీ కాలేజీ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. ఆదేవిధంగా రామన్నపేట, బట్టల బజార్, ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్, ఓఎస్.నగర్, పాపయ్యపేట చమన్, దేశాయిపేట, బాలాజీనగర్, ఎంహెచ్ నగర్, నజరేత్‌పుర, కొత్తవాడ, డాక్టర్స్‌కాలనీ, బ్యాంక్ కాలనీ, మత్రివెంకటయ్య కాలనీ, రామ్‌నాథ్‌పురి, ఫిల్టర్‌బెడ్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఎలక్ట్రికల్, ఆపరేషన్ వరంగల్ డివిజనల్ ఇంజనీర్ శంకేశి మల్లికార్జున్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## గురుకుల ప్రవేశానికి నేడు చివరి గడువు

హనుమకొండ రూరల్, జనవరి 22 : గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తులకు ఈ నెల 23వ తేదీ చివరి అవకాశమని వరంగల్ రీజియన్ ప్రాంతీయ సమన్వయ అధికారి ఎస్.విద్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. www.tswreis.ac.in, www.tsswreisjc.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## రేపు గణిత టాలెంట్ టెస్ట్

హనుమకొండ రూరల్, జనవరి 22: ఈ నెల 24న గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించాలని గణిత ఫోరం బాధ్యులు జిల్లా అధ్యక్షుడు తౌటం భాస్కర్, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ప్రభుత్వ, జిల్లా, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు తెలుగు మీడియం నుంచి, మరో ముగ్గురు ఇంగ్లీష్ మీడియం నుంచి అనుమతించాలన్నారు. 24న ఉదయం టెస్ట్ నిర్వహించి వెంటనే ఫలితాలు ప్రకటించాలన్నారు. ప్రతి మండలం నుంచి గెలుపొందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ నెల 27వ తేదీన రీజినల్ సైన్స్ సెంటర్‌లో జరిగే టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థులను పంపాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు.

## 26న చేపట్టే కిసాన్ ర్యాలీలో పాల్గొనండి

గిర్మాజీపేట, జనవరి 22 : ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా ఈనెల 26న చేపట్టిన కిసాన్ వాహన ర్యాలీలో రైతులు పాల్గొనాలని మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సమీపంలోని ఓంకార్ భవన్‌లో చిర్ర సూరి అధ్యక్షతన జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా, వివిధ కార్మిక సంఘాల బాధ్యుల సమావేశంలో రమేష్ కేంద్ర రైతు వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. కనీస మద్దతు ధర, రుణ విముక్తి చట్టాల కోసం దేశ వ్యాప్తంగా రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చాగా ఏర్పడి ఉద్యమాలు చేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా ఈనెల 26న రిపబ్లిక్ డే రోజున దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో కిసాన్ వాహన ర్యాలీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఫిబ్రవరి 10న గ్రామీణ బంద్ పాటిస్తున్నట్లు చెప్పారు. 26న వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి జరిగే కిసాన్ వాహన ర్యాలీలో వరంగల్ జిల్లా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పి.రమేష్ పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు, కార్మిక, ప్రజాసంఘాల బాధ్యులు గోనే కుమారస్వామి, రాచర్ల బాలరాజు, వీరగోని శంకరయ్య కుసుంబ బాబురావు, భూక్య సమ్మయ్య,ఓదెల రాజన్న, ఈర్ల పైడి తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్యకు పాదయాత్ర

### నెక్కొండ నుంచి పాదయాత్ర చేపట్టిన సర్దార్‌సింగ్


పాదయాత్రతో బయలు దేరిన సర్దార్‌సింగ్

నెక్కొండ, జనవరి 22 : దేశంలో రా మరాజ్యం రావాలని, హిందువులందరూ సనాతన ధర్మాన్ని కాపాడాలని కోరుతూ నెక్కొండ మండలం పత్తిపాక గ్రామానికి చెందిన రైతు జరుపుల సర్దార్‌సింగ్ సోమవారం నెక్కొండ నుంచి అయోధ్యకు పాదయాత్రను చేపట్టారు. ప్రతీ హిందువు నిత్యం జైశ్రీరాం అన్నప్పుడే తన పాదయాత్ర సఫలీకృతమౌతుందన్నారు. రామ భక్తుడైన తాను శ్రీరాముడి ఆజ్ఞమేరకే తాను ఈ పాదయాత్ర చేపట్టానన్నారు. నెక్కొండ నుంచి అయోధ్యకు 1300 కిలో మీటర్లు ఉంటుందని ప్రతీ రోజు 60 నుంచి 70 కిలోమీటర్లు నడుస్తానన్నారు. ఈ పాదయాత్రను సర్దార్‌సింగ్ చెప్పులు లేకుండా చేస్తున్నారు. శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో రామభక్తులు సర్దార్‌సింగ్ యాత్ర విజయవంతం కావాలని కోరుకుంటూ ఘనంగా సన్మానించారు.

## రామాలయంలో ముస్లింల పూజలు


చెన్నారావుపేటలోని శ్రీరామ ఆలయంలో పూజలు చేసిన ముస్లింలు

చెన్నారావుపేట, జనవరి 22 : అయోధ్యలో శ్రీ బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీరాముని ఆలయంలో ఓ ముస్లిం కుటుంబం ప్రత్యేక పూజలను చేసింది. గ్రామానికి చెందిన మహమ్మద్ సుబాన్, నసీమా బేగం దంపతులు కుటుంబంతో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాముని విగ్రహ ప్రతిష్టాపన రోజున మతాలకు అతీతంగా రామునికి పూజలు చేయటంపై ఆ కుటుంబాన్ని పలువురు అభినందించారు.

# మార్మోగిన శ్రీరామ నామం


కాళేశ్వరాలయంలో భజన చేస్తున్న భక్తులు

మహదేవపూర్, జనవరి 22: అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం అంగరంగవైభవంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భజన కార్యక్రమాలను నిర్వహించారు. కాళేశ్వరంలోని ఆలయ అర్చకులు గట్టు రాముశర్మ, ఆలయ వేదపండితుడు పాండె ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్రస్వామికి పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళహారతులు, తీర్థ ప్రసాదాలు భక్తులకు అందించారు. ఈ కార్యక్రమానికి ఆలయ సిబ్బందితోపాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

● కాటారం : అయోధ్యలో బాలరాముడు (రాం లల్లా) విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంతోపాటు పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామనామజపంతో తన్మయత్వం చెందారు. గారెపల్లి, రేగులగూడెం, కాటారం, గంగారం, దేవరాంపల్లి, గూడూరు, గంగపురి, కొత్తపల్లి ఆంజనేయస్వామి ఆలయాలు, బొప్పారం సీతారామచంద్రస్వామి, దన్వాడ దత్తాత్రేయస్వామి, చింతకాని చెన్నకేశవస్వామి, సబ్‌స్టేషన్‌పల్లి మల్లికార్జునస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, శోభాయాత్రలు నిర్వహించారు. పలువురు దాతల సహకారంతో నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, వేదపండితులు కృష్ణమోహన్, ప్రవీణ్, లక్ష్మీకాంత్, గణేష్, రామాచార్యులు, నర్సింహాచార్యులు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

● చిట్యాల : బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా ఆలయాల్లో వేడుకలను ప్రజలు కన్నుల పండువగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయాలను శుభ్రం చేసి, పూల మాలలతో అలంకరించి, ఆలయాల ముందు వివిధ ఆకృతుల ముగ్గులను వేసి అందంగా అలంకరించారు. అర్చకుల వేద మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు జరిపించారు. చిట్యాల, చింతల్లపల్లి, వెంకట్రావుపల్లి, చింతకుంటరామయ్యపల్లి, జడల్‌పేట, ఒడితలతో పాటు పలు గ్రామాల్లో ప్రత్యేక స్క్రీన్‌లు, పెద్ద టీవీలతో బాల రాముడి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వీక్షించారు. అన్ని గ్రామాల్లో అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు నిర్వహించారు. హనుమాన్ భక్త మండలి సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● వెంకటాపూర్(రామప్ప) : అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండల పరిధి ఎల్లారెడ్డిపల్లి గ్రామంలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు కొలనుపాక శివుడు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఆలయం ఆవరణలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్సై చల్ల రాజు ప్రారంభించారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు దేవాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు బేతి సతీష్, బైకని చిన్నరాజయ్య, బండి శ్రీను, పులి కోటయ్య, మెంతుల వంశీ, కుమార్, సంతోష్, రంజిత్, నరేష్, బన్నీ, రమేష్, సంపత్, శివుడు, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

● మల్హర్: బాల రాముడి ప్రతిష్ఠాపన సందర్భంగా మండల కేంద్రమైన తాడిచర్లలోని వెంకటేశ్వర ఆలయం, మల్లారంలోని హనుమాన్ సహిత శివ పంచాయితన ఆలయంతో పాటు పలు ఆలయాల్లో పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రహ్లాద్‌శర్మ, శ్యామ్‌సుందర్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● కన్నాయిగూడెం : అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనతో మండలంలోని గ్రామాల్లో పండుగ వాతా వరణం నెలకొంది. మండలంలోని గుర్రేవుల, బుట్టాయిగూడెం రామాలయం, ముప్పనపల్లి, ఏటూరు, దేవాదుల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● ఏటూరునాగారం : అయోధ్య రామయ్య ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఏటూరునాగారం మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి రామాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అర్చనలు, అభిషేకాలు, ఆశీర్వచనం కార్యక్రమాన్ని చేపట్టారు. ఏటూరునాగారం మండలంలోని శ్రీరాముడి భక్తులు క్రాస్ రోడ్డు నుంచి వైజంక్షన్ మీదుగా రామాలయ ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు.

● మంగపేట: మండలంలోని ఆలయాలు రామనామంతో మార్మోగిపోయాయి. అయోధ్యలో బాలరాముడు కొలువుదీరి రామమందిరంలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుక జరుగుతుండగా ఇదే తరహాలో గ్రామాల్లోనేఇ అన్ని రామాలయాలు, వివిధ గుడుల్లో పూజల క్రతువులను అర్చక, పూజారులు శాస్త్రోపదేశంగా నిర్వహించారు. మంగపేటలో జ్వాల యూత్ ఆధ్వర్యంలో గంపోనిగూడెం ఆంజనేయాస్వామి విగ్రహం వరకు గ్రామస్థులు ర్యాలీ నిర్వహించారు. బోరునర్సాపురం, రాజుపేట, మల్లూరు, అకినేపల్లి-మల్లారంలల రామ భక్తులు ఊరేగింపులు నిర్వహించారు. దేవాలయాల వద్ద ఏటూరునాగారం సీఐ మండల రాజు, స్థానిక ఎస్సై గోదారి రవికుమార్, ఏఎస్సై అబ్బయ్య నేతృత్వంలో బందో బస్తు నిర్వహించారు. కమలాపురంలో సాయిబాబా ఆలయం, శ్రీసీతారామచంద్రస్వామి, అభయాంజనేయాస్వామి అర్చకులైన రామసుబ్బారావుశర్మ, ప్రతాపురం శ్రీనివాసాచార్యులు, ఈశ్వరనాథశర్మతో పాటు రామతీర్థ భక్తుడు లింగంపల్లి శ్రీనివాసరావులను గ్రామస్థులు, ఆంజనేయ భక్తులు ఘనంగా సత్కరించారు

● వెంకటాపురం(నూగూరు): అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో రాముడి ఫొటోలు పెట్టి పూజలు నిర్వహించగా విజన్ పబ్లిక్‌స్కూల్ చిన్నారులతో రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడి వేషధారణ చేసి సీతారాముల ఫొటోల వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం మండలకేంద్రంలో ర్యాలీ చేపట్టారు. ఆతదుపరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు వేల్పూరి లక్ష్మీనారాయణ, ధనపనేని వెంకటేశ్వర్లు, వేల్పూరి శ్రీను, వేణు, తదితరులు పాల్గొన్నారు.

● వాజేడు : అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో రామనామం మార్మోగింది. జగన్నాథపురం, కొంగాల, గుమ్మడిదొడ్డి, పేరూరు, ధర్మవరం, చంద్రుపట్ల, తదితర గ్రామాల్లోని రామాలయాలు, హనుమాన్ మందిరాల వద్ద రామభక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రామభక్తులకు గ్రామస్థులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఊరవీధుల్లో రాముడి భజనలతో శోభాయాత్ర నిర్వహించారు.

● తాడ్వాయి: బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మండలంలోని కాటాపూర్ గ్రామంలో గల సీతారామాంజనేయస్వామి దేవాలయంలో మాజీ సర్పంచ్ పులి నర్సయ్యగౌడ్ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో శ్రీరాముడి శోభాయాత్ర నిర్వహించగా ప్రజలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని శ్రీరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో గ్రామంలో రామనామ స్మరణ మార్మోగింది. అనంతరం దేవాలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పుల్లూరి గౌరమ్మ, ఎన్ఆర్ఐ పులి రవి, తదితరులు పాల్గొన్నారు.

● టేకుమట్ల : అయోధ్య బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండలం వ్యాప్తంగా రామాలయ, అంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు రామక్రిష్టాపూర్(వి), గర్మిళ్లపల్లి, సోమన్‌పల్లి, రామక్రిష్టాపూర్(టి), రాఘవపూర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో జరిగిన వేడుకులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● మహదేవపూర్ రూరల్ : మండలంలోని ఆలయాలు రామనామం మార్మోగింది. మండల కేంద్రంతో పాటు మందరగిరి వెంకటేశ్వరస్వామి ఆలయం, బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, ఎన్కపల్లి, రాపల్లికోట, అంబట్‌పల్లి దేవాలయాలు కళకళాడాయి. భక్తులు ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు చేశారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అయోధ్య బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎల్‌డీ స్క్రీన్ల ద్వారా వీక్షించారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి అన్నదానాలు నిర్వహించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

వెంకటాపురం(నూగూరు), జనవరి 22: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆయన మండలంలో తొలిసారిగా సోమవారం పర్యటించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎదిర నుంచి మండల కేంద్రం వరకు ఆర్‌అండ్‌బీ రహదారి దెబ్బతిందని, తక్షణమే మరమ్మతులు చేయాలని అన్నారు. తాగు, సాగునీటి, వైద్య సౌకర్యాలను కల్పించాలన్నారు. మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని, ఎదిర, సూరవీడు గ్రామాల్లో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం కోసం పాటుపడతానని అన్నారు. బీఆర్ఎస్ అమలు చేసిన దళితబంధు నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

## యాదవ సంఘం కమిటీ ఏర్పాటు

కాటారం, జనవరి 22: అఖిల భారత యాదవ మహాసభ కాటారం డివిజన్ అడ్‌హక్ కమిటీని సోమవారం ఏర్పాటు చేశారు. జిల్లాలో గ్రామ, మండల కమిటీలు రద్దయిన నేపథ్యంలో అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నట్టు యాదవ సంఘం నాయకులు తెలిపారు. అడ్‌హక్ కమిటీ సభ్యులుగా గడవేన దేవేందర్, గడ్డం చంద్రయ్య, గడ్డం కొమురయ్య, అబ్బినవేన ఐలయ్య. మొగిలి రాజ్‌కుమార్, తొట్ల బాపు, శ్రీశైలం, ఆత్మకూరి కుమార్, గడ్డి మల్లేష్‌ను ఎన్నకున్నారు. డివిజన్‌లోని కాటారం, మల్హర్, మహాముత్తారం, మహదేవపూర్, పలిమెల మండలాల్లో కమిటీలు వేయనున్నట్లు సభ్యులు తెలిపారు.

● మల్హర్: భారత యాదవ మహాసభ కొయ్యూర్ గ్రామ శాఖ, యూత్, మహిళా కార్యవర్గాలను ఎన్నుకున్నారు. కొయ్యూరులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొయ్యూర్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా సిద్ది లింగమూర్తి, ప్రధాన కార్యదర్శి ఇట్టవేన శరత్, కోశాధికారిగా ఏటెల్లి రాజగట్టు, యూత్ అధ్యక్షుడిగా బోయిని రమాకాంత్, ప్రధాన కార్యదర్శి మొగిళి సిద్ధార్థ, ఉపాధ్యక్షుడిగా ఏటెల్లి దేవేందర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా అక్కల రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా మొగిళి లక్ష్మి, కోశాధికారిగా కన్నవేన మల్లక్కను ఎన్నుకున్నారు.

## మహిళా సాధికారతపై బాలికలకు అవగాహన

మహదేవపూర్ రూరల్, జనవరి 22: మండలంలోని అంబట్‌పల్లి జిల్లా ఉన్నత పాఠశాల, పలిమెల మండలం పంకెన కేజీబీవీలో విద్యార్థినులకు మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. మిషన్ శక్తి ఇన్‌చార్జి కోఆర్డినేటర్ అనూష సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. బాలికలు ఎదుర్కొంటున్న అసమానతపై అవగాహన కల్పించారు. పురుషులతోపాటు మహిళలకు సమాన హక్కులు ఎలా పొందాలో వివరించారు. బాల్య వివాహాల వల్లే కలిగే అనర్థాల గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి రాజకొమురయ్య, విద్యార్థులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గొత్తికోయలకు నిత్యావసర సరుకులు

తాడ్వాయి, జనవరి 22: మండలంలోని జలగలంచ, మొండ్యాలతోగు, తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న గొత్తికోయ కుటుంబాలకు సోమవారం దుగ్గి శాంతయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ దుగ్గి మధు రాజ్‌కుమార్ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం 50 గొత్తికోయ కుటుంబాలకు నిత్యావసర సరుకులతోపాటు పిల్లలకు బిస్కెట్లు, ఆటవస్తువులు అందజేసినట్లు తెలిపారు.

## ఎక్స్‌గ్రేషియాకు కార్మికులు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 22: అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఎక్స్‌గ్రేషియా కోసం ఫిబ్రవరి 29లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సహాయ కార్మిక అధికారి వి.వినోద సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకుని ప్రమాదవశాత్తు చనిపోయినా, అంగవైకల్యం పొందిన కార్మికులకు కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని తెలిపారు. అర్హులైన వారు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద ఈ-శ్రమ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షలు, అంగవైకల్యం పొందితే రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా అందుతుందని వివరించారు.

## ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

ములుగు కలెక్టరేట్, జనవరి 22: జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఈనెల 29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని సోమవారం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. 22,23 తేదీల్లో జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 24న తుది జాబితా ప్రకటన వెలువడుతుందని, 29న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎస్ఎంసీ సభ్యుల ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఎస్ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారని, మధ్యాహ్నం 2నుంచి 4గంటల వరకు తొలి సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ సహా ఒక్కో తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రులు సభ్యులుగా ఉంటారని, వారితో పాటు మరో ఐదుగురు ఎక్స్ అఫీషియో సభ్యులుగా, ఇద్దరు కోఆప్టెడ్ సభ్యులు ఉంటారని వివరించారు. హెచ్ఎం కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. 50శాతం తల్లిదండ్రులు ఎన్నికలకు హాజరుకావాలని ఆయన కోరారు. ప్రధానోపాధ్యాయులు విధిగా షెడ్యూల్‌ను అనుసరించి ఎస్ఎంసీ ఎన్నికలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు.


బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కిరణ్ ఖరే

## బాధితులకు సత్వర న్యాయం చేయాలి

**ప్రజాదివస్‌లో ఎస్పీ కిరణ్ ఖరే**

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 22: వివిధ సమస్యల నిమిత్తం స్టేషన్లకు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివస్‌లో వివిధ మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులను స్వీకరించారు. వాటిపై ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఫోన్లో మాట్లాడతూఊ ఎంతటి సమస్య అయినా పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే పరిష్కారమవుతుందనే నమ్మకం ప్రజల్లో ఉంటుందన్నారు. వారి నమ్మకాన్ని మరింత రెట్టింపు చేసేలా పోలీసులు విధులు నిర్వర్తించాలని సూచించారు. ఓపిగ్గా బాధితుల సమస్యలను తెలుసుకొని చట్ట ప్రకారం పరిష్కార మార్గాలు చూపాలన్నారు. ప్రజాదివస్‌లో మొత్తంగా వివిధ మండలాల నుంచి 12 మంది బాధితులు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు.

## అప్రోచ్ రోడ్డు పనులను పరిశీలించిన కలెక్టర్


అప్రోచ్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

గోవిందరావుపేట, జనవరి 22: మండల పరిధి రాఘవపట్నం సమీపంలోని జంపన్నవాగుపై వంతెన, అప్రోచ్ రోడ్డు పనులను ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర సమీపిస్తున్న నేపథ్యంలో రాఘవపట్నం అప్రోచ్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వచ్చిన వరదల కారణంగా జంపన్నవాగుపై వంతెన దెబ్బతినడంతో మేడారం జాతరకు వెళ్లే ప్రైవేట్ వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా మరమ్మతు పనులను వేగంగా పూర్తిచేసి అప్రోచ్ రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆమె వెంట పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, ఏఈ అజిత్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దాడి కేసులో ముగ్గురి రిమాండ్


నిందితుల అరెస్టును చూపుతున్న ఎస్సై ప్రసాద్

మహదేవపూర్ రూరల్, జనవరి 22 : మండలంలోని అంబట్‌పల్లి గ్రామానికి చెందిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు మహదేవపూర్ ఎస్సై కొట్టె ప్రసాద్ సోమవారం తెలిపారు. పాతకక్షలతో గ్రామానికి చెందిన తీగల రాజయ్య, తీగల రమేష్, తీగల దుర్గమ్మ తమ సమీప బంధువైన తీగల గంగులుపై దాడికి పాల్పడి గాయపరిచారని చెప్పారు. ఈమేరకు తీగల గంగులు ఫిర్యాదు మేరకు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

## డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

చిట్యాల, జనవరి 22: డీటీఎఫ్ రూపొందించిన క్యాలెండర్‌ను ఎంఈవో కోడెపాక రఘుపతి సోమవారం ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఈకార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సమ్మయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు జంపయ్య, చేరి ప్రభాకర్, ఉపాధ్యాయులు సరళాదేవి, విజయలక్ష్మి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులు పరిష్కరించాలి

**ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ**


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగు కలెక్టరేట్, జనవరి 22: ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన వినుతలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను అదనపు కలెక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి 14 వినతులు రాగా వాటిపై అధికారులతో మాట్లాడారు. వినతులను అధికారులు పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, డీఐవో అప్పల నాయుడు, విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, చీఫ్ ప్లానింగ్ అధికారి ప్రకాష్, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీఎస్‌వో సర్దార్‌సింగ్, డీఆర్‌డీవో నాగపద్మజ, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

### పురుగుల మందు తాగి

## యువకుడి ఆత్మహత్య


నిఖిల్ (ఫైల్)

గణపురం, జనవరి 22: తల్లి మందలించిందనే మనస్తాపంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చెల్పూరులో చోటుచేసు కుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెల్పూరులోని వీరయ్యపల్లికి చెందిన శ్రీపతి రాజయ్య, రాజేశ్వరి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. కూతురు వివాహం చేయగా కుమారుడు నిఖిల్ (23) గత ఏడాది పాలిటెక్నిక్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం నిఖిల్‌ను మిర్చితోట వద్దకు వెళ్లి నీళ్లు పారించాలని తల్లి చెప్పింది. దీన్ని అతడు నిరాకరించాడు. దీంతో తల్లి మందలించగా అతడు మనస్తాపం చెందాడు. తల్లి చెప్పినట్టే పొలం వద్దకు నీరుపారించేందుకని వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం తండ్రి పొలం వద్దకు వెళ్లి చూడగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొని ఉన్నాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై సాంబమూర్తి పరిశీలించారు. తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## చికిత్స పొందుతూ మృతి

టేకుమట్ల, జనవరి 22: మండలంలోని రామక్రిష్టాపూర్(వి) గ్రామానికి చెందిన అడగాని కిషన్‌రావు(52) చికిత్స పొందుతూ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో సోమవారం మృతి చెందాడు. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం... కిషన్‌రావుకు రెండేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. అప్పటి నుంచి అతడు కొన్ని ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆదివారం తీవ్ర కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అయినప్పటికీ తగ్గకపోవడంతో కడుపునొప్పి భరించలేక మనస్తాపం చెంది అతడు పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చిట్యాల సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుమారుడు సాంబశివుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

# దేవుడి పేరుతో అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలకు కట్టుబడి ఉంటానన్నారు. తనకు దేవుడిపై కోపం లేదని, ఆ పేరును అడ్డంపెట్టుకొని అప్పటి ఎమ్మెల్యే, ఆయన కుటుంబం, అనుచరుల అక్రమాలకు పాల్పడ్డారన్నారు. కాంట్రాక్టర్లు, ఉద్యోగులు, ప్రజలు ఇచ్చిన సొమ్ముతో నిర్మించిన ఆలయాన్ని తన సొంతమైన జీఎమ్మార్ ట్రస్టు పేరుతో ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. ఈ ఆరోపణలన్నీ నిరూపిం చేందుకు తాను సిద్ధమేనన్నారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న కోటంచ లక్ష్మీనరసిం హస్వామి ఆలయం, బుగులోని వెంకన్న ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నరసింహ స్వామి సాక్షిగా మాటిస్తున్నానని అన్నారు. ప్రజలు గెలిపించినందుకు అహంకారం లేకుండా వారికి సేవలు చేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు నిరుపేదలైన అర్హుల పేర్లు సూచించాలని కోరారు. కార్యకర్తలు ఆధిపత్యం కోసం కొట్లాడుకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో నష్టపోయివాల్సి వస్తుందన్నారు. గత ప్రభుత్వం మిగులు బడ్జెట్ ఉన్నా రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిందని, అయినా వెనకడుగు వేయకుండా ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయితా ప్రకాశ్‌రెడ్డి, ఎంపీపీ పున్నం లక్ష్మి, పీసీసీ సభ్యుడు చల్లూరి మధు, నాయకులు ఎన్.ఎస్.ఆర్.సంపత్‌రావు, గుంటోజు క్రిష్ణయ్య, వీరేందర్, బానోతు రవీందర్, ముల్కనూరు భిక్షపతి, మేకల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.